క్లుప్తంగా

సీపీకి ఆహ్వానం



హన్మకొండ కల్చరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 29న ఉదయం నిర్వహించనున్న శివకల్యాణానికి హాజరు కావాలని దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ కోరారు. ఈమేరకు సీపీ కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాను బుధవారం కలిసి కోరారు. అనంతరం సీపీకి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి ఆహ్వానించారు.

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేముందు జాగ్రత్త

కాజీపేట: వివిధ అవసరాల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి సూచించారు. కాజీపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆయా కాలనీల్లో పోలీసులతో పెట్రోలింగ్ ముమ్మరం చేశామని పేర్కొన్నారు. కాలనీల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. వేరే ప్రాంతాలకు వెళ్లేముందు నమ్మకంగా ఉండే ఇరుగుపొరుగు లేదంటే బంధువులకు సమాచారం ఇవ్వాలన్నారు. నగదు, ఆభరణాలు, విలువైన వస్తువులను ఇళ్లలో వదిలి బయటకు వెళ్లొదని చెప్పారు. విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100తో పాటు 87126 85122 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

గోదామాధవ కేంద్రంలో స్తోత్రం పుస్తకం ఆవిష్కరణ



హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో బుధవారం స్తోత్రం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక రచయిత అరుట్ల భాషాచార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆపదుద్ధారక స్తోత్రం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం నిర్వాహకుడు అరుట్ల శ్రీనివాసాచార్యస్వామి మాట్లాడుతూ పుస్తకాల కోసం భక్తులు 98495 49434, 98490 29561 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అనంతరం విశేష పూజలు, ఆపదుద్ధారక స్వామికి మహాహారతి జరిపి మహానివేదన చేశారు.

మనోవికాస కేంద్రానికి స్కూల్ బస్సుల వితరణ



ఖిలా వరంగల్: వరంగల్ మల్లికాంబ మనోవికాస కేంద్రానికి ఎన్‌ఆర్‌ఐ అమెరికన్ మ్యూజిక్ స్కూల్ డైరెక్టర్ పందిరి వీణాదేవి రూ.60 లక్షల విలువగల రెండు మినీ స్కూల్ బస్సులను బుధవారం బహూకరించారు. వరంగల్ శివనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రోత్సాహంతో మనోవికాస కేంద్రాన్ని ఎన్‌ఆర్‌ఐ వీణాదేవి దత్తత తీసుకుని ఇటీవల రూ.10లక్షల విలువైన ఇండస్ట్రీయల్ వాషింగ్ మిషన్ అందజేసి వీణాదేవి తన సేవా దాతృత్వాన్ని చాటుకున్నారు.

సహస్ర మోదక గణపతి హోమం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య సహస్ర మోదక గణపతి హోమాన్ని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు సాయికృష్ణ శర్మ ప్రారంభించారు. ఆలయంలో కార్తీక మాసోత్సవాల సందర్భంగా హోమం, సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి నిత్యకల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, గంగుల రాజిరెడ్డి, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

వ్యతిరేకులకు పార్టీలో స్థానం లేదు

ఖిలా వరంగల్: సీపీఎం వ్యతిరేకులకు పార్టీలో స్థానం లేదని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్నూరు జ్యోతి, తాటికాయల రత్నం, ప్రత్యూష, దాసు, లావణ్య, మొహరున్నీసా, ముంతాజ్, ఉసిల్ల శ్రీనివాస్, ఉసిల్ల దీప, మాధవి, రమేష్, వాణి, సరిత, గున్నాల ప్రభాకర్, స్వరాజ్యం, జుబేదా, కవిత, రవీందర్, ఉపేందర్.. పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని పేర్కొన్నారు. పార్టీకి వారికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు.

మరోసారి తెరపైకి బస్టాండ్

- ఏర్పాటుపై రైల్వే అధికారులతో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని చర్చలు
- సఫలీకృతం కావాలని కాజీపేట పట్టణ ప్రజల ఆకాంక్ష

కాజీపేట: కాజీపేట పట్టణంలో బస్టాండు ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా బస్టాండు నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇటు కాజీపేట రైల్వే జంక్షన్, అటు హైదరాబాద్ వైపు ఉన్న బస్టాపు అభివృద్ధి ఎప్పుడూ చర్చనీయంశంగానే ఉంటోంది. బస్టాండు పేరుతో జరిగిన ఉద్యమాల్లో భాగస్వాములైన నాయకులు ఎందరో రాజకీయ పదవులను అనుభవించారు కానీ, ప్రజల ఆకాంక్ష మాత్రం నెరవేరలేదు. 1990లో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు సైతం బస్టాండు ఏర్పాటు కోసం ఉద్యమాన్ని నడిపారు. ఆ సమయంలో అనేక మందిపై పోలీసులు కేసులు నమోదు చేయగా జైళ్లకు వెళ్లిన ఘటనలు ఉన్నాయి. అయితే అసలు కథ అంతా ఇక్కడి నుంచే మొదలైందని చెప్పొచ్చు. బస్టాండు నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం కోర్టులో ఉండటంతో ఒక అడుగు కూడా ముందుకుపడిన దాఖలాలు లేవు.

చొరవ చూపుతున్న పశ్చిమ ఎమ్మెల్యే

కాజీపేట ప్రాంతంలో బస్టాండు నిర్మించి ప్రజల చిరకాల వాంఛను తీర్చాలనే లక్ష్యంతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎంలతో పాటు ఉన్నతాధికారులతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. రైల్వే జంక్షన్ ఎదుట ఉన్న స్థలం ఇరుకుగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు నడిపించలేని పరిస్థితిలో అధికారులు ఉన్న విషయాన్ని రైల్వే అధికారులకు విన్నవించారు. రైల్వే జంక్షన్ సమీపంలో ఉన్న స్టేడియం స్థలాన్ని బస్టాండు నిర్మాణం కోసం కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వడంతో పాటు రైల్వేకు ప్రయాణికులు, సరుకు రవాణాతో ఆదాయం వస్తుందని రైల్వే అధికారులకు ఎమ్మెల్యే గణాంకాలతో సహా వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు.



బస్టాండ్ ప్రతిపాదిత రైల్వే స్టేడియం

చర్చనీయాంశంగా బస్టాండ్ నిర్మాణం

మూడున్నర దశాబ్దాల కాలం తర్వాత తిరిగి బస్టాండు నిర్మాణం విషయం తెరపైకి రావడం పట్టణంలో చర్చనీయంశంగా మారింది. ఎమ్మెల్యేతో పాటు వరంగల్ ఎంపీ కడియం కావ్య కూడా ఇటీవల రైల్వే జీఎంతో చర్చించడంపై హర్షం వ్యక్తమవుతోంది. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించి బస్టాండు నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయిస్తే రెండు రకాల ప్రయోజనాలు చేకూరుతాయని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

బస్టాండ్ కోసం ప్రయత్నించాలి



చాలాకాలం తర్వాత బస్టాండు నిర్మాణం కోసం ఎమ్మెల్యే ప్రయత్నించడం ఆనందంగా ఉంది. రైల్వే అధికారులు స్పందించి బస్టాండుకు అవసరమైన స్థలం ఇస్తారనే ఆశాభావంతో ఉన్నాం.

– మారగోని భద్రయ్య గౌడ్, సీనియర్ సిటిజన్, కాజీపేట

బస్టాండ్ నిర్మాణానికి కృషి



కాజీపేట పట్టణంలో ప్రజలకు ఉపయోగపడేలా బస్టాండ్ నిర్మించాలనే సంకల్పంతో ప్రయత్నాలను ముమ్మరం చేశాం. రైల్వే స్థలంలో బస్టాండ్ నిర్మించడం వల్ల ప్రయాణికులకు అనువుగా ఉండటంతో పాటు సంస్థకు అదనపు ఆదాయం సమకూరే విధానాన్ని రైల్వే జీఎంకు పలుమార్లు విన్నవించాం. సంబంధిత అధికారులు సానుకూలంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నా.

– నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

క్షేత్రస్థాయిలో ‘సఖి’ సేవలందించాలి

- జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి జయంతి

కాజీపేట అర్బన్: క్షేత్రస్థాయిలోకి మహిళా కమిటీలు వెళ్లి ఆపదలో ఉన్న మహిళలకు సఖి సెంటర్ అందిస్తున్న సేవలు అందించాలని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి జయంతి సూచించారు. హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామస్థాయి మహిళా కమిటీలకు క్షేత్ర సందర్శన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలోని మహిళలకు సఖి అండగా ఉంటోందని అవగాహన కల్పించాలని చెప్పారు. వారి వ్యక్తిగత ఆరోగ్యం, ఆహారం పట్ల అవగాహన కల్పించాలని, బాధిత మహిళలకు ఆత్మస్థైర్యం నింపాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ తెలిపారు. సఖి లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కోఆర్డినేటర్ కల్యాణి, కవిరాజ్, ఇందిర, రవీందర్, అక్తర్, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయంతి

వినియోగదారులు అవగాహన కలిగిఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఖిలా వరంగల్: వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతతోపాటు కల్తీలపై అవగాహన పెంచుకోవాలని జాతీయ కన్జ్యూమర్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజన్న అధ్యక్షతన కన్జ్యూమర్ రైట్స్, రిడ్రెసెల్ మెకానిజంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులను తెలుసుకుంటే అభివృద్ధి చెందవచ్చని అన్నారు. ఆహార పదార్థాల్లో కల్తీని గుర్తుపట్టేలా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం వినియోగదారులకు హక్కులు, బాధ్యతలపై సీసీఐ రాష్ట్ర ప్రతినిధి ఎస్.చక్రపాణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణజ్యోతి, డాక్టర్ రాజు, సౌమ్య, శశాంక్, సాయికిరణ్, డాక్టర్ గణేష్, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ముందుండాలి

- బీజేపీ ఎన్నికల అధికారి పెదోళ్ల గంగారెడ్డి

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాస్థాయి క్రియాశీలక సభ్యత్వ నమోదులో నాయకులు ముందుండాలని బీజేపీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి పెదోళ్ల గంగారెడ్డి అన్నారు. హంటర్‌రోడ్డు దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రియాశీలక సభ్యత్వాల నమోదు, డివిజన్, మండల స్థాయి సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతీ కార్యకర్త తన బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణ రెడ్డి, రావు కిషన్, కాచం గురుప్రసాద్, పగడాల కాళీప్రసాద్, కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందం, జయంత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంగారెడ్డి

బాక్సింగ్ పోటీలకు ఎంపిక



హసన్‌పర్తి: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి చెంగెళ్ల లక్ష్మణాచారి ఎంపికయ్యాడు. వచ్చేనెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో లక్ష్మణాచారి పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్‌ఎం సుమాదేవి తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో లక్ష్మణాచారి పాల్గొని ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పాఠశాలలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీ పార్థసారథి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్ విద్యార్థి ప్రతిభ



హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో జన్ను నిశాంత్ పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు కరస్పాండెంట్ తిరుమలేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నిశాంత్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కల్పనారెడ్డి, సదానందం, వెంకటేశ్వర్లు, బద్రి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీడీ ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేయాలి

- బీడీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఖాసీం

వరంగల్ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం బీడీ ఆకుపై, పొగాకుపై జీఎస్టీ మినహాయించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ.ఖాసీం డిమాండ్ చేశారు. వరంగల్ 26వ డివిజన్ లక్ష్మీపురంలో యూనియన్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకు కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి 4 కోడ్‌లుగా మార్చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఈపీఎఫ్ సంస్థలకు చెల్లించాల్సిన రూ.43 కోట్ల సొమ్మును దిగమింగారని విమర్శించారు. 40 నుంచి 50 సంవత్సరాలు పనిచేసి రిటైర్మెంట్ అయిన బీడీ కార్మికులకు రూ.7,500 పింఛన్ ఇస్తామని మోసం చేశారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.కుమార్, లక్ష్మి, సరళ, శారద, కరీం, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఖాసీం

పోరాటాల ద్వారానే సమసమాజ స్థాపన



మహాసభలో అభివాదం చేస్తున్న నాయకులు

కాశిబుగ్గ: ప్రజా పోరాటాల ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య అన్నారు. ఏసీరెడ్డినగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఖిలా వరంగల్ మండల సీపీఎం మండల మహాసభ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖిలా వరంగల్ మండలం ప్రజా పోరాటాల పురిటిగడ్డ అని అన్నారు. ఈ ప్రాంతంలో సీపీఎంకు ఎన్నో ఎదురుదెబ్బలు తగిలినా ప్రజలు పార్టీని నిలబెట్టారని గుర్తుచేశారు. అనంతరం ఖిలా వరంగల్ మండల కార్యదర్శిగా నలిగంటి రత్నమాల, 24 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 29, 30వ తేదీల్లో నర్సంపేటలో జరగనున్న జిల్లా మహా సభల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం నాయకులు నాగపురి వెంకటేశ్వర్లు, ఉదయశ్రీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



బియ్యం అందజేస్తున్న మేకల వారి వంశస్తులు

హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఇందిర కాలనీకి చెందిన మేకల లచ్చమ్మ కుటుంబానికి మేకల వారి వంశస్తులు చేయూతనందించారు. ఈమేరకు 50కిలోల బియ్యాన్ని బుధవారం అందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మేకల వంశస్తుల అధ్యక్షుడు మేకల యుగంధర్, ప్రధాన కార్యదర్శి మేకల హరిశంకర్, ఉపాధ్యక్షులు శోభన్, కన్నయ్య, కార్యవర్గ సభ్యులు సిద్ధార్థ, ప్రకాష్, కమలాకర్, సుకుమార్ పాల్గొన్నారు.



కాజీపేట అర్బన్: చేయూతనందిస్తున్న రమేష్

నిరుపేద కుటుంబానికి..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన సింగారపు వెంకటయ్య ఇటీవల మృతి చెందారు. ఈమేరకు బాధిత నిరుపేద కుటుంబానికి సామాజిక కార్యకర్త నల్లమారి రమేష్ బుధవారం చేయూతనందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చిలువేరు ఆశీర్వాదం, కండికొండ బుచ్చిరాములు, అగస్టిన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం రైల్వే మజ్దూర్ యూనియన్ అహర్నిశలు కృషి చేస్తోందని మజ్దూర్ యూనియన్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ సెక్రటరీ సీహెచ్.శంకర్‌రావు అన్నారు. కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో మజ్దూర్ యూనియన్ ఈఎల్ఎస్ బ్రాంచ్ సెక్రటరీ ఎన్.సదానందం అధ్యక్షతన బుధవారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో జరగనున్న రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో జెండా గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజాబాబా, పి.రవీందర్, సీసీఎస్ ఎండీ చిలుకు స్వామి, కాజీపేట సీసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, ట్రెజరర్ నరసింహారెడ్డి, ఏడీఎస్ నాగమణి, ఈఎల్ఎస్ బ్రాంచ్ చైర్మన్ ఎండీ.ఇబ్రహీం, అన్ని బ్రాంచీల నాయకులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చిన మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావును బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, దువ్వ కనకరాజ్, అఫ్జల్, కోండ్ర శంకర్, హుస్సేన్, దువ్వ నరేష్, యాకూబ్ పాల్గొన్నారు.



రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో జరిగిన మీటింగ్‌లో జనరల్ సెక్రటరీ శంకర్‌రావు, తదితరులు

వ్యక్తిగత శుభ్రత అలవర్చుకోవాలి

హన్మకొండ చౌరస్తా: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని అడిషనల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్మోహన్ సూచించారు. పెద్దమ్మగడ్డలోని ప్రభుత్వ పాలెం పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాలెం ప్రైమరీ హెచ్‌ఎం వేదాంతచారి, ఉపాధ్యాయులు, పెద్దమ్మగడ్డ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్‌కుమార్, నర్సింగ్ ప్రిన్సిపాల్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ ఇంద్రారెడ్డి, సీఓ కిరణ్, ఏఎన్ఎం సరిత, సిబ్బంది బొక్క అశోక్, ప్రమీల, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కార్తీకమాసం వనభోజనాలు



భోజనం వడ్డిస్తున్న ఆర్ఎం విజయభాను

కాజీపేట అర్బన్: హనుమకొండ రాంనగర్‌లోని టీజీఎస్ఆర్టీసీ హనుమకొండ డిపోలో కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వన భోజనాల కార్యక్రమాన్ని వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. టీజీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ సజ్జనార్ ఆదేశానుసారం కార్తీకమాసం -24 వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ధరంసింగ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, మోహన్‌రావు, రవీందర్, చంద్రశేఖర్, నాజియా తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో రైల్వే జేఏసీ పూజలు



పూజలు చేస్తున్న రైల్వే జేఏసీ నాయకులు

కాజీపేట రూరల్: వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ బృందం సభ్యులు బుధవారం అమ్మవారిని దర్శించుకొని చీరసారె సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు మాట్లాడుతూ కాజీపేటలో నెలకొల్పుతున్న రైల్వే వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం శ్రీకారం చేపట్టినందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా రైల్వేశాఖ త్వరితగతిన పూర్తి చేయాలని అమ్మవారి సన్నిధిలో పూజలు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల 40 ఏళ్ల స్వప్నం రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు చేయాలని రైల్వే జేఏసీ కీలక పాత్ర పోషించి పోరాటాలు, నిరాహార దీక్షలు, నిరసనలు చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ బృందం జి.భాస్కర్, అనుమాల శ్రీనివాస్, డి.రవీందర్, మహేష్, పి.రమేష్, బి.శివప్రసాద్, జి.సుధాకర్, బి.మాధవ్, సంపత్, రవీందర్, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఫార్మసీతో ఉజ్వల భవిష్యత్



మామునూరు: బీ ఫార్మసీ, ఫార్మాడీ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీ.ఎన్ శర్మ, వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ చందుపట్ల వాణిదేవి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కమల్‌యాదవ్ అధ్యక్షతన నూతన విద్యార్థుల ఆహ్వాన సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఫార్మసీ రంగంలో పుష్కలమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వివరించారు. సమావేశంలో ప్రొఫెసర్ రామకృష్ణ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



హసన్‌పర్తి: ఈనెల 29న హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. 66వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్‌తో కలిసి ఎర్రగట్టు క్రాస్‌లోని బాలాజీ గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రజనీకుమార్ మాట్లాడుతూ కేసీఆర్ అమరదీక్ష ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ చుంచు రవీందర్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ పాడి మల్లారెడ్డి, సొసైటీ డైరెక్టర్ విజేందర్, నాయకులు వాసుదేవారెడ్డి, నద్దునూరి నాగరాజు, ఇమ్మడి రాజేందర్, చాతళ్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో కార్మికుల చేరిక

ఖిలా వరంగల్: వరంగల్ 43వ డివిజన్ పరిధిలోని సామిల్, టింబర్ డిపోలో పనిచేసే హమాలీ కార్మికులు బుధవారం సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీలోకి చేరారు. వారికి ఆ సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్‌తో కలిసి కార్యదర్శి గన్నారపు రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కందిక చెన్నకేశవులు, తాళ్లపల్లి జాన్‌పాల్, ఎండీ.ఇస్మాయిల్, దోమ మల్లేశం, ఎండీ.హైమద్, రాజలింగం, సారంగం, కనకం సమ్మయ్య, ఎండీ.ఖాదర్, ఖరీమ్, హఫీజ్, సలీం, హుస్సేన్, శ్రీను, ఖాజా పాల్గొన్నారు.

మడికొండ గురుకులంలో ట్రెడిషనల్ డే

మడికొండ: మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు)లో బుధవారం ట్రెడిషనల్ డే నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సంప్రదాయ వేడుకలకు ముఖ్యఅతిథిగా హ్యూమన్ రైట్స్ అధికారి సత్య పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పండుగల పుట్టు పూర్వోత్తరాలు, జరుపుకునే విధానం, వాటితో ముడిపడి ఉన్న సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థినులు వెల్లడించారని వివరించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో అన్ని మతాలు, కులాలకు సంబంధించిన సంప్రదాయాలను విద్యార్థులు తెలుసుకుంటారని అన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను ఎప్పుడూ మరవొద్దని తెలిపారు.



ట్రెడిషనల్ డేలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రీ ఆర్‌డీ పరేడ్ క్యాంపు విద్యార్థికి అభినందన



కేయూ క్యాంపస్: మహారాష్ట్ర పూణేలో ఈనెల 12నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపులో పాల్గొన్న కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని తోట అంజలిని ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు, అధ్యాపకులు కళాశాలలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా అంజలికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు స్వప్న, టి.వెంకటేష్, వైష్ణవి, సాయితరుణ్, సురేందర్ నాయక్, కళాశాల సూపరింటెండెంట్ వీరు నాయక్ పాల్గొన్నారు.